ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

గురువారం 8 మే 2025



అకాల వర్షం.. తడిసిన ధాన్యం



- ఇబ్బందులు పడిన రైతులు

6

'ఆపరేషన్ సింధూర్'తో దేశసత్తా చాటిన సైనిక దళాలు

- బీజేపీ నాయకుల సంబరాలు

8

సమగ్ర సర్వే డబ్బులేవి..?



- సర్వే ముగిసి ఆరు నెలలైనా అందని రెమ్యూనరేషన్
- డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్యూమరేటర్ల ఎదురుచూపులు
- సర్వేలో పాల్గొన్న 2 వేల మంది సిబ్బంది
- దశలవారీ ఆందోళనలకు సిద్ధం



జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే(ఫైల్)



ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ముగిసి ఆరు నెలలు గడి చింది. అయితే సర్వేచేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తమకు రావాల్సిన పారితో షికాల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దశలవారీగా ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను ఉపాధ్యాయులతో పాటు ఉద్యో గులు ఎంతో శ్రమకోర్చి నిర్వహించారు.

వీరు చేసిన సర్వే ఫామ్స్‌ను డేటాఎంట్రీ ఆపరేట్లు కంప్యూట రీకరణ చేశారు. ఈ సర్వే ఆధారంగా కుల గణనకు కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా సర్వే చేపట్టాలని ఆమోదం తెలిపింది. ఇంత సమర్థ వంతంగా పూర్తిచేసిన సిబ్బందికి మాత్రం రెమ్యూనరేషన్ చెల్లింపులు మాత్రం జరగడం లేదు. రెమ్యూనరేషన్ కోసం ఎదురుచూసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు, విడతల వారీగా నిరసనలు తెలపడానికి సిద్ధమయ్యారు. గత మార్చి 18న, ఈనెల 5న వినతిపత్రాలు అందించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో పోరాటాలు చేయాలని భావించారు.

జిల్లాలో రెమ్యూనరేషన్ బకాయిలు రూ.2.10 కోట్లు

జిల్లాలో డేటా ఎంట్రీ ఆపరేట్లు, ఎన్యూమరేటర్లు, 2వేల మంది వరకు భాగస్వాములు అయ్యారు. వీరిలో ఎన్యుమరేటర్లకు రూ.10వేలు, సూపర్‌వైజర్లకు రూ.12 వేల చొప్పున చెల్లిస్తామని ప్రభు త్వం నిర్ణయించింది. వీరితో పాటు ఒకఫాం కం ప్యూటరీకరణ ఆన్‌లైన్‌చేస్తే ప్రభుత్వ ఉద్యోగులైతే రూ.15, ప్రైవేటు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.30 చొప్పున చెల్లించాల్సి ఉంది. దీనికి అనుగుణంగా ఉత్తర్వులు కూడా జారీచేసింది. ప్రభుత్వం వారం రోజుల్లోనే రెమ్యూనరేషన్ చెల్లిస్తుందని భావించి నా నిరాశే మిగిలింది. ఆపరేటర్ల బ్యాంక్ ఖాతా వివరాలు కూడా తీసుకున్నారు. డేటాఎంట్రీ ఆపరేటర్లలో నిరుద్యోగ యువత, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ విద్యార్థులు పోటీ పరీక్షలకు ఇతర, ఫీజులకు ఉపయోగపడుతాయని డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా మారి పనిచేశారు. సర్వే పూర్తి అయి ఆరునెలలు గడిచినా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అధికారులు మాత్రం ప్రభుత్వానికి నివేదిక పంపిం చామని ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని చెబుతున్నారు. మరోవారం రోజుల్లో రెమ్యూనరేషన్ రాని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళనకు సిద్ధమని ప్రకటించారు. వీరితో పాటు రెమ్యూనరేషన్ కాకుండా ఫాంలు ప్రింటింగ్ చేసిన వాళ్లు తమకు రావాల్సిన రూ.10లక్షల బకాయిల కోసం తిరుగుతున్నారు.

జిల్లాలో 1.93 లక్షల కుటుంబాల వివరాల సేకరణ..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో 1,531 బ్లాక్ లుగా విభజించి లక్షా 93 వేల 838 కుటుంబాలను ఉపాధ్యాయులు, ఉద్యో గులు, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా సర్వేలు చేశారు. సర్వే సమయంలో కొన్నిసార్లు కుటుంబ సభ్యులు లేక పోయినా తిరిగి మళ్లీ వెళ్లి వివరాలు నమోదు చేశారు. సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణనకు సం బంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు నమోదు చేయడానికి కనీసం గంట సమయం వరకు పట్టింది. ఆ తరువాత మండలాలు, జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లతో కంప్యూ టరీకరణ చేశారు. మహిళా ఉద్యోగులు సైతం ఇంటింటికి ఎంతో ఉత్సా హంగా వెళ్లి సర్వే నిర్వహించినా రెమ్యూనరేషన్ కోసం మాత్రం నిరీక్షించక తప్పడం లేదు.

జిల్లాలో జరిగిన సమగ్ర సర్వే వివరాలు...

మండలం	బ్లాక్‌లు	పూర్తయిన కుటుంబాలు
రుద్రంగి	39	5,097
చందుర్తి	76	11,343
వేములవాడ రూరల్	57	8,173
బోయినపల్లి	104	12,414
వేములవాడ	48	6,836
కోనరావుపేట	117	15,060
వీర్నపల్లి	64	4,520
ఎల్లారెడ్డిపేట	122	17,243
గంభీరావుపేట	115	14,670
ముస్తాబాద్	131	16,575
తంగళ్లపల్లి	127	17,071
ఇల్లంతకుంట	154	17,279
సిరిసిల్ల మున్సిపల్	231	31,601
వేములవాడ మున్సిపల్	146	15,956
మొత్తం	1,531	1,93,838

అభివృద్ధితో ముందుకు వెళితే ఓర్వలేకపోతున్నారు..

- కాళేశ్వరం పేరిట తెలంగాణ సంపద దోచుకున్నారు - బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే నని, ప్రజాప్రభుత్వం అభివృద్ధి పేరిట ముందుకు పోతుంటూ చూస్తూ ఒర్వలేకపోతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవా రం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో విలేక రుల సమావేశం నిర్వహించారు. కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్, మాజీ మంత్రి కేటీఆర్‌లు సీఎం రేవంత్‌రెడ్డిపై మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు అర్థమయ్యేలా చెబితే దానిని బీజేపీ, బీఆర్ఎస్ వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని అన్నారు. కేటీఆర్, బండి సంజయ్ మాటలు కోటలు దాటుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మూడు నెల ల్లోనే గత అసెంబ్లీ సమావేశంలోనే చెప్పడం జరిగిందన్నారు. ఇష్టాను సారంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా దుబారా ఖర్చు చేయకుండా తెలంగాణను ముందుకు తీసుకపోతున్నామని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ఆడంబరాలకు పోకుండా ప్రతినిత్యం 18 గంటలు కష్టపడుతున్నారని అన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు పోతున్నామని అన్నారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సి టీలు ప్రభుత్వం పెడితే బీఆర్ఎస్, బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నారని, దుబాయ్ కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. నలుగురు తెలంగాణ రాష్ట్రాన్ని ధనిక రాష్ట్రంగా గొప్పలు చెప్పడం చూస్తే వాళ్ల తీరు బహార్ షర్వాణీ, అందర్ పరేశానీ అన్నట్లుగా ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ ధనిక రాష్ట్రం అంటే బీజేపీ ఎందుకు ఖండించలేదని అన్నారు. కాళేశ్వరం పేరిట తెలం గాణ సంపదను దోచుకున్నారని అన్నారు. ఆదాయాన్ని పెంచే మార్గాలు ప్రజా ప్రభుత్వం చేపడుతుంటే అడ్డుకట్ట వేస్తున్నారని అన్నారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో కూడా ప్రభుత్వంపై ఆరోపణలు చేశారని, కిషన్‌రెడ్డి భూములపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను ఎందుకు తీసివేశారని ప్రశ్నించారు. బీజేపీ అసమర్థత కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందని, విభజన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేంద్రం నుంచి బండి సంజయ్ నిధులు తీసుకరా వాలని అన్నారు. రోడ్డు వేశామని గొప్పలు చెబుతున్నారని, కానీ టోల్ ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. రాహుల్‌గాంధీ చెప్పినట్లుగా దేశమం తా కులగణన చేసి తీరాల్సిందేనని అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ధర్నా చేశారన్నారు. ధర్నాకు 50మంది ఎంపీలు, 15రాష్ట్రాల బీసీ సంఘం నేతలు వచ్చారని అన్నారు. బీఆర్ఎస్ బీసీ కులగణనలో ఎందుకు పాల్గొనలే దని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం జరుగుతుందని, కవిత బీసీలకు నాయకత్వం వహించాల్సిన అవసరం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ రంగానికి కూడా పాలసీ లేదని, ప్రజా ప్రభుత్వంలో అన్ని రంగాలకు పాలసీలు చేస్తున్నామని అన్నారు. కేసీఆర్ హెలికాప్టర్ ఎక్కి కరీంనగర్, సిరిసిల్లలో దిగవ చ్చు కానీ, తమ మంత్రులు వాడితే నచ్చడం లేదా వారికి, ఇంత అహంకారం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బండి సంజయ్ వాస్తవాలు తెలుసుకోవాలని, బీఆర్ఎస్ హయాంలో 2022-23లో మే 6 వరకు 32,915 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ప్రజాప్రభుత్వంలో ఇప్పటివరకు 1,12,405 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. రైతులు తేడాను గమనిం చాలని కోరారు. తూకం వేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని వివరించారు. సన్న వడ్లను కొనుగోలు చేస్తున్నామని, వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, సూరదేవ రాజు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : చట్టాలను మహిళలందరు సద్విని యోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో బుధవారం కమాండెంట్ ఎంఐ సురేష్ అధ్వర్యంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు చట్టలపై అవగాహన సదస్సును బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన లక్ష్మీరాజం మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను కల్పించిం దని, అంతేకాకుండా మహిళలకు సమానమైన హక్కులతో పాటు ప్రత్యేకమైన చట్టాలను కూడా కల్పిస్తుందన్నారు. దీనిలో భాగంగానే గృహ హింస నిరోధక చట్టం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ చట్టం, నిర్భయ చట్టాల ద్వారా మహిళలు వారి హింసల్ని ఎదుర్కో వడానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. మహిళ లు ఏ సందర్భంలోనైనా లైంగిక, మానసిక, శారీరక, ఆర్థిక వేధింపులకు గురైతే 181 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సహా యాన్ని అందించడం జరుగుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లోను ముందుండాలని మహిళలకు ప్రభుత్వం ప్రత్యేకమైన రిజర్వేషన్‌లు ఏర్పాటుచేసిందన్నారు. మహిళలు ఆర్థికంగా ముందు ఉండడం వల్ల కుటుంబం అభివృద్ధి చెం దుతుందన్నారు. కార్యక్రమంలో మహిళ సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ రోజా, బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రమీల, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిని కలిసిన న్యాయవాదులు



సీఏవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్ మెట్రో పాలిటిన్ కోర్టు నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టుకు బదిలీపై వచ్చిన చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి. మాధవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సీఏవోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల మంజూరైన న్యాయ నిర్మాణ్ భవనం పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి, ఉపాధ్యక్షులు సజ్జనం అనిల్, క్యాషియర్ నరేశ్, క్రీడల, కల్చ రల్ కార్యదర్శి రమేశ్, గ్రంథాలయ కార్యదర్శి శరత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

సిరిసిల్లలో సినీ నటి అనసూయ సందడి

- కాసం ఫ్యాషన్ మాల్ ప్రారంభం



కాసం షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి అనసూయ భరద్వాజ్



షాపింగ్ మాల్‌లో చీరను ప్రదర్శిస్తున్న అనసూయ భరద్వాజ్

సిరిసిల్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): సినీ నటి అనసూయ భరద్వాజ్ సిరి సిల్లలో సందడి చేశారు. పాటలపై స్టెప్పులు వేసి తన అభిమానులను ఉత్సాహపరిచారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాసం ఫ్యాషన్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి అన సూయ వస్తున్నారని ప్రచారం చేయడంతో సిరిసిల్ల గాంధీ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కాసం ఫ్యాషన్ వద్దకు పెద్ద సంఖ్యలో అనసూయ అభి మానులు తరలివచ్చారు. అనసూయ షాపింగ్‌మాల్‌ను ప్రారంభించి ఫ్లోర్‌లలో పట్టణ ప్రముఖులతో ముచ్చటించారు. అనంతరం షాపింగ్ మాల్ ఎదుట ఏర్పాటుచేసిన వేదికపై పాటలకు స్టెప్పులు వేశారు. ఉత్సాహపరుస్తూ మాట్లాడారు. కాసం ఫ్యాషన్‌లో మంచి బ్రాండ్‌లు లభిస్తాయని సిరిసిల్లలో ప్రజలకు కూడా అందుబాటులోకి వచ్చాయని తక్కువ సమయంలోనే ఎక్కువ స్టోర్‌లు ప్రారంభించారన్నారు. కాసం మాల్ డైరెక్టర్లు కాసం నమశివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారి నాథ్, కాసం శివప్రసాద్‌లు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో నాలుగు సంవత్సరాలుగా ప్రజల మన్ననలను పొందుతూ ఇప్పటివరకు తెలం గాణ, ఆంధ్రప్రదేశ్‌లో 17స్టోర్‌లు ప్రారంభించామన్నారు. అధునాత ఫ్యా షన్ డిజైన్లను వినియోగదారులకు తక్కువ రేట్లకే నాణ్యమైన వస్త్రాల ను అందిస్తున్నామన్నారు. కాసం ఫణి, కాసం సాయికృష్ణ, ఎంసాని ప్రవీణ్, పుల్లూరి అరుణ్‌కుమార్, వరుణ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, గుజ్జె తార తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ వీడియో తీసి యువకుడి ఆత్మహత్య

● ప్రేమించిన యువతి మోసగించిందని మనోవేదన



దార ఐలేష్ (ఫైల్)

జమ్మికుంట/ఇల్లందకుంట, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి తనను కాదని మరొకరితో వివాహం చేసుకోవడంతో మన స్థాపానికి గురైన ఓ యువకుడు సెల్ఫీవీడియో తీసి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఇల్లందకుంట మండలం లక్ష్మణపల్లి గ్రామానికి చెందిన దార ఐలేష్(23) హైదరాబాద్‌కు చెందిన వరలక్ష్మి అనేయువతితో కొన్నాళ్లుగా ప్రేమాయణం సాగిస్తున్నాడు. వీరి ద్దరు కొంతకాలంపాటు సహజీవనం చేసినట్లు సమాచారం. ఇంటర్మీడి యట్ చదువుతున్న సమయంలో వీరిమధ్య ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారినట్లు తెలుస్తోంది. ఐలేష్ జమ్మికుంటలో ఐటిఐ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో అప్రెంటీస్‌షిప్ చేస్తున్నాడు. ఓ శుభకా ర్యానికి హాజరయ్యేందుకు మూడురోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఇటీవల వరలక్ష్మి తన బావను వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ఐలేష్‌కు దూరంగా ఉంటూవస్తోంది. దీంతో తీవ్రమనస్థాపానికి గురైన ఐలేష్ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఉదయం నుంచి ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు వాట్సాప్ స్టేటస్‌పెట్టుకున్నాడు. జమ్మి కుంట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారమ్‌పై కూర్చొని సెల్ఫీ వీడియో తీసు కుంటూ ఎనిమిదేళ్ల వరలక్ష్మితో కలిసిమెలిసి ఉన్నానని, సెల్‌ఫోన్ కొని చ్చానని పేర్కొన్నాడు. మేం ఇద్దరం కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు, రికార్డులు తనఫోన్‌లో ఉన్నాయని, తాను ఆత్మహత్య చేసుకున్న తర్వాత వాటన్నింటిని వరలక్ష్మికి చూపించాలని సెల్ఫీ వీడియోలో కోరాడు. తన మృతదేహాన్ని ఆమె ఇంటిఎదుట వేయాలని సెల్ఫీ వీడియోలో పేర్కొ న్నాడు. మన ఆస్తులు అమ్మి అయినా కేసు పెట్టి శిక్షించాలని తల్లిదం డ్రులను సెల్ఫీ వీడియోలో కోరాడు. అనంతరం ఇంటర్‌సిటీ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి



రాజ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన మాజీఎంపీటీసీ కంక ణాల రాజ్‌కుమార్‌రెడ్డి(45) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన భూమి కరీంనగర్-వరంగల్ బైపాస్ రోడ్డు కింద కోల్పోవడంతో మనో వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే గుండెపోటుకు గురయ్యాడు. బుధవారం కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామ స్థుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. కుమార్తె శివాని దహన సంస్కారాలు నిర్వహించింది. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్, పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు.

వివాహం కావడం లేదని.. యువకుడి బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): వివాహం కావడం లేదని మన స్థాపం చెందిన యువకుడు ఒగ్గు మహేశ్(24) ఉరి వేసుకుని బలవ న్మరణానికి ఒడిగట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మహేశ్ గొర్రెలను పెంచుతూ జీవించేవాడు. వివాహ సంబం ధాలు వచ్చిన నిశ్చయం కాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈనెల 6న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి చేరుకోలేదు. దాంతో ఆందోళనకు లోనైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. బుధవారం ఉదయం ఇంటి సమీపంలోని ఓ పాడుబడిన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి తల్లి రాజవ్వ, సోదరుడు నగేశ్‌లు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండేపల్లి కేసీఆర్‌నగర్‌కు చెందిన తాడూరి రామ్‌కుమార్(38) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... రామ్‌కుమార్ జిరాక్స్ మిషన్ మెకానిక్‌గా పనిచేస్తూ భార్య వనిత, ముగ్గురు కుమారులను పోషిస్తున్నాడు. సరైన పనిలేక కుటుంబ పోషణకు అప్పులు చేసి తీవ్ర ఆర్థికఇబ్బందులకు గురయ్యాడు. కుటుంబ పోషణభారం, ముగ్గురుపిల్లలు జన్మించినప్పుడు వైద్య ఖర్చుల కోసం రూ.3లక్షల వరకు అప్పులయ్యాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య వనిత, కుమారులు సుకజీత్(11), శ్రీవాత్సవ్(5), విహాన్ ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దహన సంస్కారాలు చేయలేని పరిస్థితి..

కుటుంబాన్ని పోషించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకోగా.. దహన సంస్కారాలు నిర్వహించడానికి భార్య చేతిలో చిల్లి గవ్వలేక దీనంగా మృతదేహం వద్ద రోదిస్తుండడం పలువురిని కలచివేసింది. మృతదేహం వద్ద ముగ్గురు చిన్నపిల్లలతో గుండెలు పగిలేలా రోదిస్తుండడం పలు వురిని కంటతడి పెట్టించింది. దహన సంస్కారాలకు ఆర్థిక సాయం చేయడంతో పాటు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతు న్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

● పండ్ల తోటలు... కూరగాయల సాగుకు రాయితీలు
● యంత్ర పరికరాలకు సబ్సిడీ



చొప్పదండి, మే 7 (ఆంధ్రజ్యోతి): వరిసాగుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగును పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. పండ్ల తోటలు, పూల సాగు, కూరగాయల సాగుకు సబ్సిడీలతో పాటు యంత్రాలు, యంత్ర పరికరాలు, సూక్ష్మ నీటి సేద్యానికి 2025-26 సంవత్సరానికి ఉద్యానవనశాఖ రాయితీలను అందిస్తోంది.

పండ్ల తోటల పెపంకం (హెక్టారుకు)...

మామిడి: 19,200 రూపాయలు, **నిమ్మ:** 19,200, **జామ:** 19,200, **అరటి:** 16,800, **అవకాడో:** 12,000, **బొప్పాయి:** 7,200, **డ్రాగన్ ఫ్రూట్:** 65,000, **ముదురు మామిడి తోటల పునరుద్ధరణ** 9,600, **ఆయిల్ ఫాం సాగుకు** 10,500 రూపాయల రాయితీ ఉంటుంది.

కూరగాయల సాగు (ఎకరానికి)...

టమాటో: 10,000, **వంగ:** 10,000, **క్యాబేజీ:** 10,000, **కాలిఫ్లవర్:** 10,000, **మిర్చినారుకు** 10 వేల రూపాయల సబ్సిడీ ఉంటుంది.

● ప్లాస్టిక్ మల్చింగ్ వేసుకునే రైతులకు హెక్టారుకు 20 వేల రూపాయల సబ్సిడీ.

● తీగజాతి కూరగాయల సాగు, శాశ్వత పందిర్ల నిర్మాణం కోసం ఎకరానికి లక్ష రూపాయల సబ్సిడీ అందజేస్తారు.

● పూల సాగును చేపట్టే రైతులకు ప్రతి ఎకరాకు 8 వేల రూపాయల రాయితీని నగదు రూపంలో అందజేస్తారు.

యంత్రాలు...

ఉద్యాన పంటల సాగు కోసం 20 హెచ్‌పి ట్రాక్టర్‌కు 2 లక్షల 45 వేల సబ్సిడీ
పవర్ టిల్లర్: లక్ష రూపాయల సబ్సిడీ
పవర్ వీడర్ : 75 వేల సబ్సిడీ
బ్రష్ కట్టర్స్ : 25 వేల సబ్సిడీ

సూక్ష్మ నీటి సేద్యం

బిందు, తుంపర్ల సేద్య పరికరాల కోసం సబ్సిడీ అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ, బీసీ రైతులకు 90 శాతం, ఓసీ రైతులకు (5 ఎకరాల వరకు) 90 శాతం, 5 ఎకరాలపై రైతులకు 80 శాతం సబ్సిడీ అందజేస్తుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

చింతల రోహిత్, ఉద్యానశాఖ అధికారి, చొప్పదండి



ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యాన పంటల సాగుతో అనేక లాభాలు ఉన్నాయి. మార్కెట్‌లో పూలు, కూరగాయలు, పండ్లకు చాలా డిమాండ్ ఉంది. రైతులు ఉద్యాన పంటల సాగు చేపట్టాలి. ఉద్యాన పంటలను తక్కువ నీటితో ఎక్కువ సాగు చేపట్టవచ్చు.

బాలుడి మృతికి కారణమైన తల్లి, ఆమె ప్రియుడు అరెస్టు

సిరిసిల్ల క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి): కొడుకు మృతికి కారణమైన కన్నతల్లి, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన అరుష్(5) అనే బాలుడిపై కన్నతల్లి, ఆమె ప్రియుడు దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనలో తల్లి మాధవి, కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికిచెందిన సామల కిషన్‌లను బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. తల్లి జైలుకు వెళ్లడంతో ఒంటరైన ఎనిమిదేళ్ల కూతురిని బాలసంరక్షణ సమితి చేరదీసింది. బాలికను చూసుకునేందుకు నానమ్మ, తాత ముందుకు వచ్చినప్పటికీ చట్ట ప్రకారం పోలీసులు ఆమెను బాలసంరక్షణ సమితికి అప్పగించారు. దీంతో బాలికను సఖీ కేంద్రానికి తరలించారు.

బెహరాన్‌లో మల్లాపూర్ యువకుడి మృతి



పోగుల నరేష్(ఫైల్)

మల్లాపూర్, మే, 7 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌కు చెందిన పోగుల నరేష్ (23)అనే యువకుడు బెహరాన్ దేశంలో అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు గ్రామస్థులు బుధవారం తెలిపారు. పోగుల సురేష్ జీవనోపాధి కోసం ఐదేళ్ల క్రితం బెహరాన్‌కు వెళ్లాడు. కొంతకాలం నుంచి నరేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు.బెహరాన్‌లో పనులు చేస్తుండగా ఆకస్మత్తుగా ఒక్కసారిగా కుప్పకూలి కిందపడ్డాడు. స్థానికులు గమనించగా నరేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే వారు కుటుంబ సభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. నరేష్ మరణవార్త విన్న కుటుంబసభ్యుల రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య

గొల్లపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన నార్ల త్రిష(21) అనే యువతి తల్లి మందలించిందని బుధవారం తెల్లవారుజామున ఇంటిలో ఉరేసుకుని బలవన్మరణం చెందింది. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు నార్లత్రిష ముంబాయిలో ఇంటర్ పూర్తి చేసి వచ్చి ఇంటి వద్దే ఉంటోంది. ఇంటిలో పనులుచేయడం లేదని మంగళవారం తల్లి మందలించింది. దీంతో తీవ్రమనస్తాపానికి గురైన త్రిష బుధవారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మపురి, మే 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొంతాపూర్ గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని సీసీఎస్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 11,100 రూపాయలు, 6మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను ధర్మపురి పోలీసులకు అప్పగించగా కేసునమోదు చేశారు. జిల్లాఎస్పీ ఆదేశాలతో నిఘా పటిష్టం చేసి దాడులు నిర్వహిస్తున్నట్లు సీసీఎస్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్స్ రమష్, అఫ్రోజ్, కమలాకర్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంగాధర, మే 7 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కురిక్యాలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. అక్రమ ఇసుకరవాణాలో సంబంధమున్న నలుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆమె తెలిపారు.

అదనపుకోర్టు ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో అదనపు జిల్లాకోర్టు ఏర్పాటుచేయాలని న్యాయవాదులు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సాను కూలంగా స్పందించిన బండి సంజయ్‌కుమార్ ఈ విషయాన్ని హైకోర్టు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రమేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది, బీజేపీ జిల్లాఅధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

వీర్నపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పండించిన వరిధాన్యం అకాలవర్షానికి తడిసిపోయింది. మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ధాన్యపురాశులు, తూకం వేసిన బస్తాలు తడిసిపోయాయి. అన్నదాతలు తడిసిన ధాన్యాన్ని ఆరబోసేందుకు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం తరలింపు జాప్యం చేయడం వల్ల నష్టపోతున్నామని రైతులు మండిపడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

చందుర్తి: చందుర్తి మండలంలో ఈదురు గాలులకు విద్యుత్‌తీగలు తెగిపడ్డాయి. స్తంభాలు, వృక్షాలు నెలకొరిగాయి. మండలకేంద్రంతోపాటు మర్రిగడ్డ, ఎనగల్ గ్రామాల్లోని కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం తడిసిపోగా, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. లింగంపేట, ననుగుల రహదారిలో చెట్లువిరిగి విద్యుత్‌స్తంభాలపై పడడంతో కరెంటువైర్లు నేలవాలాయి. లింగంపేటలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడగా వెంటనే మరమ్మతులు చేపట్టారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంతోపాటు రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, తిమ్మాపూర్, గుండారం, రాజన్నపేటఅల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాలవర్షానికి కొనుగోలుకేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. వరద నీటికి ధాన్యం కొట్టుకుపోయింది. ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లలో చేరిన వాననీటిని తొలగించేందుకు అన్నదాతలు అవస్థలు పడ్డారు. తూకం వేసినబస్తాలు తడిసిపోవడంతో మొలకెత్తుతాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.



వీర్నపల్లిలో వర్షపునీటిని తొలగిస్తున్న రైతు



చందుర్తిలో తడిసిన ధాన్యం బస్తాలు



చందుర్తిలో తెగిన విద్యుత్ వైర్లు

నిర్వాసితులకు పరిహారం నిర్ణయించలేదు

● కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

వేములవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు చెల్లించే పరిహారం ధరపై ఇంకా తుదినిర్ణయం తీసుకోలేదని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఒకప్రకటనలో తెలిపారు. మంగళవారం వేములవాడలో రోడ్డువెడల్పునకు సంబంధించి సర్వేని వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించానని, ఈ సందర్భంగా పరిహారంపై మీడియాలో వచ్చిన ధర అధికారికంగా నిర్ణయించలేదన్నారు. రోడ్డు డిజైన్, నిర్మాణగడువు తదితరఅంశాలపై కూడా తుది ప్రకటన విడుదల చేయలేదని, పరిహారం ధరపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు.

అగ్నికి ఆహుతైన పంటలు

ముత్తారం మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుపెల్లి శివారులోని మానేరువాగు పరివాహక ప్రాంతంలో అగ్ని ప్రమాదంలో ముగ్గురు రైతులకు తీవ్ర నష్టం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మానేరు వాగు పరివాహక ప్రాంతం లో రైతులు వేల్పుల రవికి చెందిన ఎకరం వరి కుప్ప, అలాగే చల్ల సదికి చెందిన మూడు ఎకరాల కోసి ఒక దగ్గర ఉన్న వరి కుప్ప పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నికి ఆహుతై కోసిన పంట మొత్తం కాలిపోవడంతో రైతుల ఆదుకోవాలని వేడుకొన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు. ఇదేప్రాంతంలో ఉన్న రాపెల్లి సురేందర్‌కు చెందిన 10 ఎకరాల ఆయిల్ పామ్ తోటలోని 302చెట్లుపూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. చుట్టుపక్కల రైతులు వచ్చి మంటలను చల్లార్చారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగేయా లేక ఎవరైనా అంటించారా అనేది తేలాల్సి ఉంది.



కాలిపోతున్న పామాయిల్ తోట

ద్విచక్రవాహనాల నిందితుల అరెస్టు

● 12 వాహనాలు స్వాధీనం



పట్టుకున్న వాహనాలు, నిందితులతో డీసీపీ భాస్కర్

జన్నారం, మే 7 (ఆంధ్రజ్యోతి): ఒక ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న నిందితులను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేస్తున్నారు. డీసీపీ భాస్కర్ జన్నారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. నిర్మల్‌జిల్లా దస్తూరాబాద్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన బత్తుల పరమేష్, రెంకల నరేష్, కొట్టె బానేష్ , జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన లావుడ్య హరికృష్ణ, మురిమడుగు గ్రామానికి చెందిన సంపంగి రమేష్‌లు ఒక ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలను దొంగతనం చేస్తున్నారు. మార్చి 5న జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం పోచారం గ్రామానికి చెందిన కంచర్ల నరేష్ జన్నారం మండల కేంద్రంలోని ఉడిపి హోటల్ వద్ద తన ఫ్యాషన్ ప్రో వాహనాన్ని నిలిపి వెళ్లాడు. బయటకు వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 7న ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఫ్యాషన్ ప్రో వాహనంపై వస్తున్న బత్తుల పరమేష్, రెంకల నరేష్ పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు పట్టుకుని విచారించారు.

పోలీసుల విచారణలో బానేష్, హరికృష్ణ, రమేష్‌లతో కలిసి వాహనాలు దొంగతనాలు చేస్తున్నారని ఒప్పుకున్నారు. వీరు మంచిర్యాల, జగిత్యాల, జన్నారం, తదితర ప్రాంతాల్లో 12ద్విచక్రవాహనాలను దొంగలించారు. ఇందులో బత్తుల పరమేష్, రెంకల నరేష్, లావుడ్య హరికృష్ణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 12 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో మరో నిందితుడు సంపంగి రమేష్ పాత కేసులో జైలులో ఉండగా కొట్టె బానేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలను కొనుగోలు చేసినా, అమ్మినా నిజ ధృవీకరణ పత్రాలను పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిందితులను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్‌ఐ రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు

కాగజ్‌నగర్ టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి, దహెగాం, కాగజ్‌నగర్‌లోని ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను బుధవారం కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి కాగజ్‌నగర్ రూరల్‌సీఐ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. గతనెల 2న రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ ఆంజనేయ స్వామి ఆలయంలో, దహెగాం మండలంలోని బోర్లకుంట గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంతోపాటు, కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లి గ్రామంలోని భక్త ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ జరిగిందని చెప్పారు. ఈజీగా డబ్బు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశ్యంతో చోరీచేసినట్లు నిందితులు ఒప్పుకున్నారన్నారు. నిందితులు త్రిదండపాణి అనిల్‌కుమార్ (పెద్దపల్లి జిల్లా, హనుమంతునిపేట), బాణాలలక్ష్మణ్ (పెద్దపల్లి)లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై పెద్దపల్లి, వేములవాడ, వెల్గటూరు, సుల్తానాబాద్, పొత్కపల్లి, వీణవంక, ధర్మారం, మల్యాల, రామగిరి పోలీసుస్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయని తెలిపారు. మరో నిందితుడు పైడి అజయ్ (పెద్దపల్లి జిల్లా రాంపలి) పరారీలో ఉన్నాడన్నారు. కూలీపని చేసుకునే అనిల్‌కుమార్, మెకానిక్ అజయ్ కలిసి ఈనెల 2న భాగ్యనగర్ రైలులో కాగజ్‌నగర్ చేరుకున్నారని అన్నారు. రాత్రి దహెగాం వెళ్లి అక్కడి గుడి తాళాలు పగులగొట్టి చోరీచేశారని తెలిపారు. తిరుగు ప్రయాణంలో కాగజ్‌నగర్ మండలంలోని బట్టుపల్లి ఆలయంలో చోరీ చేశారని అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పంచముఖ హనుమాన్ ఆలయంలో కూడా చోరీచేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు.

మూడు చోరీ కేసుల్లో నిందితుల నుంచి రెండు వెండి కిరీటాలు, వెండి మకుటం, వెండి హారం, వెండి నామాలు, వెండి పాదుకలు, బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసినట్లు సీఐతెలిపారు. సమావేశంలో రూరల్ ఎస్సై సందీ్ కుమార్, ఏఎస్సై సర్తాజ్ పాషా పాల్గొన్నారు.

నేడు ప్రపంచ అండాశయ క్యాన్సర్ దినోత్సవం

సుభాష్‌నగర్, మే 7(ఆంధ్రజ్యోతి): అండాశయ క్యాన్సర్ మహిళలను ప్రభావితం చేసే ప్రాణాంతక క్యాన్సర్లలో ఒకటి. అండాశయ క్యాన్సర్ అనేది స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థలోని చిన్న అవయవాలైన అండాశయాలలో ప్రారంభయ్యే ఒక రకమైన క్యాన్సర్.



లక్షణాలు : అండాశయ క్యాన్సర్ యొక్క లక్షణాలు కడుపులో వాపు లాంటి భావన ఏర్పడుతుంది. దీని ఫలితంగా ఆకలి లేకపోవడం లేదా త్వరగా నిండినట్లు అనిపించడం. పొత్తికడుపులో నొప్పివస్తుంది. పేగు అలవాట్లలో మార్పులు జరుగుతాయి. విరేచనాలు, మలబద్ధకం, కడుపులో తరుచుగా గ్యాస్ అనుభూతి కొనసాగుతుంది. మూత్ర విసర్జన చేయాలనే కోరిక అనిపిస్తుంది, కానీ మూత్రవిసర్జనకు వెళితే రాకపోవడం ఉంటుంది. లైంగిక చర్యలో ఉన్నపుడు నివారించలేని నొప్పి అండాశయ క్యాన్సర్ హెచ్చరిక లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుంటారు. అయితే అండాశయ క్యాన్సర్‌ను ప్రారంభంలో గుర్తించడం కష్టమని వైద్యులు చెపుతున్నారు. అయితే ఇలాంటి లక్షణాలన్నీ అండాయశ క్యాన్సర్‌కు దారితీస్తాయని చెప్పలేమని తెలుపుతున్నారు.



ప్రపంచ అండాశయ క్యాన్సర్ దినోత్సవం ప్రాముఖ్యత

2013 నుంచి ప్రపంచ క్యాన్సర్ కూటమి ప్రపంచ వ్యాప్తంగా మే 8న అండాశయ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అండాశయ క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడం, రోగ నిర్ధారణను ప్రోత్సహించడం దీని లక్ష్యం

స్త్రీలను వేధిస్తున్న క్యాన్సర్లలో ప్రధానమైనది

డాక్టర్ విష్ణుప్రియ, గైనకాలజిస్టు మెడికవర్ హాస్పిటల్, కరీంనగర్



స్త్రీలను వేధిస్తున్న క్యాన్సర్లలో ప్రధానమైనది అండాశయ క్యాన్సర్. స్త్రీల గర్భాశయంలో రెండు వైపులా రెండు అండాశయాలు ఉంటాయి. అండాశయాల్లో కణాలు అదుపులేకుండా పెరిగిపోవడమే అండాశయ (ఒవేరియన్) క్యాన్సర్. మారుతున్న జీవనశైలి కారణంగా భారతదేశంలో అండాశయ క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. జన్యుపరమైన అంశం కూడా దీనికి కారణమవుతుంది. సాధారణంగా 50 సంవత్సరాలు నిండిన వారిలోనే అండాశయ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తుంది. దీనిని ముందుగా గుర్తించకపోతే క్యాన్సర్ కణాలు క్రమంగా చుట్టుపక్కల కణజాలాల్లోకి వ్యాప్తి చెంది శరీరంలోని ఇతర ప్రాంతాలకు క్యాన్సర్ వ్యాప్తికి దారితీయ వచ్చు. కేవలం 20శాతం అండాశయ క్యాన్సర్‌లు మాత్రమే ప్రారంభదశలో కనిపిస్తాయి. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ప్రారంభదశలో గుర్తించవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.


కల్లోల కాపురం

- బంధాలను బలితీసుకుంటున్న 'ఇగో'
- చిన్న చిన్న మనస్పర్థలతో ఠాణా మెట్లెక్కుతున్న దంపతులు
- క్షణికావేశంలో బలవన్మరణాలు

● జిల్లాకు చెందిన డిగ్రీ వరకు చదివిన ఓ యువతికి పొరుగు జిల్లాకు చెందిన యువకుడితో ఇటీవల వివాహం జరిగింది. ప్రతి ఆదివారం తనను కరీంనగర్‌కు పంపించాలని, లేదంటే కాపురం చేసేది లేదంటూ ఆమె భీష్మించుకుంది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు చెలరేగాయి. చివరికి ఇద్దరు పోలీసులను ఆశ్రయించారు. విడాకులు తీసుకోవడానికి అయినా సిద్ధమే కాని తనను ప్రతీ ఆదివారం తల్లిగారిల్లు కరీంనగర్‌కు పంపాల్సిందేనని ఆమె తెగేసి చెప్పింది. మహిళా స్టేషన్ పోలీసులు ఇద్దరికి కౌన్సెలింగ్ చేసినా ఇద్దరూ వెనక్కి తగ్గలేదు. చేసేదేమి లేక భార్య పెట్టిన కండీషన్‌కు భర్త అంగీకరించడంతో వారి సంసారం సజావుగా నడుస్తోంది.

● భర్త సెల్‌ఫోన్ లాక్ చేసుకుంటున్నాడని, ఎవరితోనో మాట్లాడుతున్నాడని అనుమానిస్తున్నది భార్య. బాత్‌రూంకు పోయిన సందర్భంలో తన ఫోన్ చెక్ చేస్తున్నదని భర్త అసహనం. ఒకరిపై ఒకరు గొడవపడి చివరకు పోలీసులను ఆశ్రయించారు. తాను స్నేహితులతో మాట్లాడుతుండడం తప్పా?అని భర్త ప్రశిస్తుంటే.. రహస్యం ఏమీలేనప్పుడు ఫోన్‌కు లాక్ ఎందుకు పెట్టుకున్నాడని భార్య ప్రశ్న. ఇద్దరికి మహిళా స్టేషన్‌లో పోలీసులు పదిమార్లు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. - కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి





దంపతుల మధ్య 'ఇగో' కాపురాలను కూల్చుతున్నది. సరదాగా సాగాల్సిన కాపురాల్లో చిన్న చిన్న మనస్పర్థలు, గిల్లికజ్జాలు, అనుమానాలు కలతలను సృష్టిస్తున్నాయి. జీవితాంతం తోడూనీడగా కలిసి నడవాల్సిన ఆలుమగల మధ్య విభేదాలు మొదలవుతున్నాయి. చిన్న చిన్న గొడవలకు సర్దుకుపోవాల్సిన దంపతులు మొండిపట్టు పడుతుండడంతో విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. చివరికి అవి విడాకులకు దారి తీస్తున్నాయి. విద్యావంతులైన దంపతుల్లోనే ఇటువంటి ఆలోచనలు రావడం ఆందోళనకు గురిచేస్తోంది. చిన్న చిన్న విభేదాలు, అనుమానాలు తారాస్థాయికి చేరి దంపతులు ఠాణా మెట్లెక్కుతుండడంతో పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలోనూ ఎవరికివారే తమ వాదనే సరైందని సమర్థించుకుంటున్నారు. ఈ సమయంలో సర్దిచెప్పాల్సిన కుటుంబ సభ్యులు సరైన సమయంలో స్పందించకపోవడంతో దంపతుల మధ్య దూరం పెరిగిపోతోంది. మరి కొందరు పోలీసులు, పెద్దల వద్దకు వెళితే ఎక్కడ పరువు పోతుందోనని, ఎవరికి చెప్పుకోలేక లోలోన మదనపడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నాయి. అనుమానాలు, అపార్థాలు, వివాహేతర సంబంధాలు సజావుగా సాగాల్సిన కాపురాల్లో కలతలు రేకెత్తిస్తూ బలవన్మరణాలకు దారితీస్తున్నాయి.

● ఉద్యోగస్తులదీ అదే దారి

మహిళా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల్లో ఉద్యోగం చేస్తున్న, డిగ్రీపైన చదువుకున్న దంపతులు, ప్రేమ వివా హం చేసుకున్న నవ దంపతులవే ఎక్కు వగా ఉంటున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తున్న దంపతుల మధ్య ఇగోతో పోలీస్‌స్టేషన్ మెట్లెక్కుతున్నారు. ఇద్దరు ఉద్యోగం చేస్తుంటడంతో సంపాదనలో తామేమీ తక్కువ కాదంటూ తరచుగా గొడవ పడుతున్నారు. ప్రేమ వివాహం చేసుకున్న వారు ఏడాదిలోపే ఆర్థిక ఇబ్బందులు, అనుమానాల కారణంగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు.

మహిళా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు..

సం.	ఫిర్యాదులు	కేసులు	రాజీపడినవి
2022	1,104	92	1,012
2023	954	86	868
2024	1,099	113	986
2025	400	39	250

(ఏప్రిల్ 15 వరకు)

● కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబాలు

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు దంపతుల్లో బేదాభిప్రాయాలు తలెత్తినా... చిన్న చిన్న గొడవలు వచ్చినా కుటుంబంలో పెద్దలు ఇరువురిని కూర్చుండబెట్టి మంచి చెడులు... వాటి పరిణామాలు విడమరచి చేప్పేవారు. మారిన కాలంతో ఉమ్మడి కుటుంబాలు అంతరించి పోతున్నాయి. వివాహం అయిన వెనువెంటనే విడిగా కాపురం ఉండడం, ఉద్యోగ రీత్యా ఇతర చోట్ల కాపురం పెట్టడంతో దంపతుల మధ్య గొడవలు తలెత్తినప్పుడు సర్దిచెప్పేవారు లేకుండా పోతున్నారు.



మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుల వెల్లువ

పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏకైక మహిళా పోలీస్ స్టేషన్ కరీంనగర్‌లో ఉంది. ఈ పోలీస్ స్టేషన్‌కు భార్యభర్తల మధ్య తగువులు, వరకట్నం వేధింపులు, గృహహింస, ప్రేమ వివాహాలకు సంబంధించిన ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కమిషనరేట్ పరిధిలో ఉన్న మూడు పోలీసు సబ్ డివిజన్లలోని 21 స్టేషన్ల సంబంధించిన మహిళల కేసులు ఈ స్టేషన్‌కు బదిలీ చేస్తున్నారు. 2024లో 1,099 మంది దంపతులు గొడవపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో 113 కేసులు నమోదుకాగా మరో 986 ఫిర్యాదుల్లో దంపతులకు కౌన్సెలింగ్‌లు ఇచ్చి సమస్యను పరిష్కరించారు. కొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2025 ఏప్రిల్ 20వ తేదీ వరకు 400 మంది భార్యభర్తలు గొడవలు పడి కరీంనగర్ మహిళా ఠాణాలో ఫిర్యాదులు చేసుకోగా 39 కేసులు నమోదయ్యాయి. 250 ఫిర్యాదులపై దంపతులకు కరీంనగర్ మహిళా ఠాణా సీఐ పి శ్రీలత, భూ మిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌తో సర్దుకుపోయారు.



ధర్మపురిలో నవరాత్రోత్సవాలు

- ఐదో రోజు పూర్ణాహుతి
- సహస్ర కలశాభిషేకం



పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఐదవ రోజు బుధవారం శ్రీ నరసింహ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఉదయం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేదమం త్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రా భిషేక పూజలు, సహస్ర కలశాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ అర్చ కులు, సిబ్బంది పాల్గొన్నారు. నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీ నరసింహ స్వామి వారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి కల్యాణం



ఖిలావనపర్తిలోని లక్ష్మీనృసింహస్వామి దేవాలయం

ధర్మారం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలో లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణం జరగనుంది. మంగళవారం నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం 7.40 నిమిషాలకు స్వామి వారి కల్యాణం వేలాది మంది భక్తుల మధ్య అంగరంగ వైభవంగా జరగనుంది. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవో కాంతరెడ్డి, చైర్మన్ సంతోష్ తెలిపారు. బుధవారం కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 13 జరిగే స్వామి వారి రథోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

రసాభాస

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

- ఏఐసీసీ పరిశీలకుడి ఎదుటే రచ్చ
- జువ్వాడి, సుజీత్‌రావు వర్గీయుల మధ్య వాగ్వాదం





జగిత్యాలలో నిర్వహించిన సమావేశంలో వాగ్వాదం చేసుకుంటున్న కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు, పార్టీ శ్రేణులను సముదాయిస్తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వ హించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం రసాభాసగా జరిగింది. ఈసమావే శానికి ఏఐసీసీ పరిశీలకుడు కత్తి వెంకట స్వామి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి హాజరు కాగా వారి ఎదుటే కోరుట్ల నియోజకవర్గానికి చెందిన రెండు వర్గాల నాయకులు రచ్చ చేశారు. వేదికపైకి మెట్‌పల్లి మార్కెట్ చైర్మన్ గోవర్ధన్ రావడంతో కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు వర్గీయులు ఒక్కసారిగా బీఆర్ఎస్ కోవర్ట్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న కోరుట్ల నియోజకవర్గానికి చెందిన కల్వకుంట సుజిత్‌రావు వర్గీయులు, నర్సింగారావు వర్గీయులతో వాగ్వాదానికి దిగి ఒకరినొకరు తోసుకున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన వారిని కాదని వలసవాదులకు మార్కెట్ చైర్మన్ పదవులు ఎలా ఇస్తారంటూ నర్సింగారావు వర్గీయులు ఆరోపించారు. ఇండిపెం డెంట్‌గా పోటీ చేసి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి బీజేపీతో కలిసింది నిజం కాదా అని జువ్వాడి నర్సింగారావును ఉద్దేశించి సుజిత్‌రావు వర్గీయులు విమర్శించారు. దీంతో పరిస్థితి చేజారుతోందని గ్రహించిన విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇరువర్గాల వారిని సముదాయించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

యోగా మాస్టర్‌కు కలెక్టర్ అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన యోగా శిక్షకురాలు పుప్పాల మల్లిక ఉత్తమ యోగా మాస్టర్ అవార్డు దక్కించుకుంది. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన ఏడవ అఖిల భారత సమావేశాలకు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన మల్లిక ఈ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి ఆమెను అభినందించారు. జాతీయస్థాయిలో ప్రతిభచాటి ఉత్తమ యోగా మాస్టర్ అవార్డును అందుకోవడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి సిద్ధారెడ్డి, యోగా కోచ్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లికకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

14 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ బీబీఎం, బీఏఎల్.) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు మే 14న ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్ ద్వారా తలనీలాల టెండర్ నిర్వహణ

వేములవాడ కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలోని తలనీలాలకు బుధవారం టెండర్‌లను ఆహ్వానించారు. టెండర్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడంతో దేవాదాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చిన తరువాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా టెండర్ నిర్వహిస్తే దానికి సంబంధించిన పూర్తి వివరాలు దేవాదాయ శాఖ కమిషనర్ పరిధిలో ఉంటాయని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 7(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం, కొత్తపల్లి మండలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 6 ట్రాక్టర్లను బుధవారం పట్టుకుని కేసులు నమోదు చేశామని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీసులు తెలిపారు. బద్దిపెల్లి గ్రామంలో 4 ఇసుక ట్రాక్టర్లు, చేగుర్తి గ్రామ శివారులో 2 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు.

అభాగ్యులకు ఆపన్నహస్తం



నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందిస్తున్న యువకులు

సమాజసేవలో మల్యాల యువకుల ఆదర్శం

హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం

మల్యాల, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలనే సదుద్దేశ్యంతో మల్యాలకు చెందిన యువకులు మన నేస్తం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి అనేక మంది అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుంటూ దాతల సహకారంతో బాధితులకు సహాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మల్యాలకు చెందిన ఆర్మీ ఉద్యోగి కీసర గణేశ్ వ్యవస్థాపకుడిగా 2021లో హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌ను స్థాపించి 50మందితో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఈ ఫౌండేషన్‌లో అన్ని వర్గాల యువకులు, ప్రజలను భాగస్వామ్యం చేశారు. ఈ సంస్థలో ఇప్పుడు 600 మంది సభ్యులు ఉండగా అందులో ఆర్మీ ఉద్యోగులు, పోలీసులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, అనేక మంది సామాజిక సేవకులు ఉన్నారు. ప్రతీ నెలా తలా కొంత పోగు చేసుకొని ఎవ రికైనా ఆపద వస్తే ఆదుకుంటున్నారు.

● అనేక సేవా కార్యక్రమాలు

ప్రమాదాల్లో గాయపడిన బాధితు లకు, వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలకు, నిరుపేద యువతీ యు వకుల వివాహాలకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు నిత్యావసర సరుకులు అంద జేస్తున్నారు. పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు ఇస్తున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు కావాల్సిన సామగ్రిని ఫౌండేషన్ ద్వారా సమకూర్చుతున్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు 30 కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశారు.



చికిత్స కోసం సాయం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సేవే లక్ష్యంగా ముందుకు


కీసర గణేశ్, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు



ఆపదలో ఉన్నావారిని ఆదుకోవాలనే లక్ష్యంతో మిత్రులతో కలిసి ఈ సంస్థను ఏర్పాటు చేశాం. బాధిత కుటుంబాలకు చేయూత అందిస్తున్నాం. యువకులు, ఉద్యోగులు, మానవతా దృక్పథం కలిగిన చాలా మంది సంస్థలో చేరి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం.

అభాగ్యులకు ఆపన్నహస్తం

: గుర్రం శ్రీధర్‌గౌడ్, సభ్యుడు



బాధిత కుటుంబాల పరిస్థితులను వాట్సప్ గ్రూప్‌లో పెట్టడంతో సభ్యుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సభ్యులు తమకు తోచిన మేరకు సాయం అందిస్తున్నారు. సమాజ సేవ చేయాల నుకునే వారంతా ఫౌండేషన్ కార్యక్రమాల్లో పాలు పంచుకోవచ్చు.

వాసవి మాత ఆలయంలో కుంకుమ పూజలు

సుల్తానాబాద్, మే 7: (ఆంధ్రజ్యోతి): వాసవి మాత జయంతి పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణంలోని వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారికి అభిషేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు కుంకుమ పూజలు చేశారు. పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ చకిలం మారుతి, వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొమురవెళ్లి భాస్కర్, కొమురవెళ్లి రాంమ్మూర్తి, రాష్ట్ర నాయకుల నగునూరి అశోక్, మాదూరి ప్రసాద్, అయితు రమేష్, రాజేంద్ర ప్రసాద్, పల్లా అనిల్, సిరిపురం రమేష్, రామిడి రవీందర్, పల్లా శ్రీనివాస్, బాదం వాణి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక వైశ్య భవన్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. అన్నదానం క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం సత్యనారాయణ, పూజా సామగ్రిని జైన రాజమౌళి, స్వీట్స్ బీరెల్లి రాజుకుమార్ సమకూర్చారు. మల్యాల శ్రీనివాస్, శ్రీనివాస్, గుంత సతీష్, కొల్లూరి కిషోర్, ఎలగందుల అశోక్, తాటిపల్లి వంశీ, రాంమోహన్, చెన్న భూమయ్య, రవీందర్, హనుమన్లు, పాల్గొన్నారు.



సుల్తానాబాద్ వాసవి మాత ఆలయంలో కుంకుమ పూజలు

నిరుపేద యువతి వివాహానికి చేయూత

ఇల్లంతకుంట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన మచ్చ వైష్ణవి అనే నిరుపేద యువతి వివాహానికి బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి బుధవారం రూ10వేల విలువైన టేకు మంచాలు అందిజేశారు. కార్యక్రమంలో ఇట్టిరెడ్డి లక్ష్మరెడ్డి, బద్దం రమణారెడ్డి, గజ్జల శ్రీనివాస్, అంజి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎల్లారెడ్డిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు సెలవుల్లో ప్రభుత్వం వేసవి శిక్షణశిబిరాలను చేపట్టిందని ఎంఈవో కృష్ణహరి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో కృష్ణహరి మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం మనోహరాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాకిస్థానీలను రాష్ట్రం నుంచి పంపించాలి

కోనరావుపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని పాకిస్థానీలను ఇక్కడినుంచి పంపించాలని బీజేపీ నాయకుడు గోపాడి సురేందర్‌రావు, మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ వరలక్ష్మికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థానీలను ఇక్కడ నుంచి వెళ్లగొట్టాలని కోరారు. మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, మాజీ ఎంపీటీసీ తీగల రవీందర్ గౌడ్, బిజెపి నాయకులు వెలిశాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదే

ఎల్లారెడ్డిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అకాల వర్షానికి కేంద్రాల్లో తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తోందని అన్నారు. ధాన్యం సేకరణను వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.

హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలి...

వీర్నపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 22న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించే హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మాలోత్ లక్పతి నాయక్ అన్నారు. మండల కేంద్రంలో హిందూ ఏక్తాయాత్ర పోస్టర్లను బీజేపీ నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని ప్రతిగ్రామం నుంచి పెద్దఎత్తున హిందువులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి పిట్ల నాగరాజు, ఉపాధ్యక్షులు మాడుగుల లింబాద్రి, బండారి మహేష్, ప్రశాంత్, బోడ వెంకటేష్, రఘుపతి, లకావత్ రాజు, ప్రకాష్, గజన్ లాల్, తౌటు రాజు, భూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

వేములవాడ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాగయ్యపల్లి గ్రామంలోని వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

వేములవాడ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): వట్టెంల, ఫాజుల్ నగర్ గ్రామాలలో ఇటీవల మరణించిన ఎంరెడ్డి మునెమ్మ, గట్టు శంకరవ్వ, కన్నం ఎల్లయ్యల కుటుంబాలను బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ పలువురు నాయకులు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణంలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మర్తనపేటలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. సెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, నాగుల సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రం, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కాగా, మర్తనపేట శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కల్యాణంలో బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, సెస్ తిరుపతి, మల్యాల దేవయ్య, చంద్రయ్య గౌడ్, వంశీ కృష్ణ, మల్లేష్, శ్రీనివాస్ గౌడ్, పర్శరాములు, శ్రీనివాస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

ఎల్లారెడ్డిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో బద్ది పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను చల్లంగ చూడాలని వేడుకున్నారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం మద్దిమల్ల సర్పంచ్ సుదర్శన్ భార్య ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నేత గాంధీరావు బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. వెంట నాయకులు మహేష్, రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పోత్‌గల్ గ్రామ పంచాయతీ వద్ద నిరసన

ముస్తాబాద్ (గంభీరావుపేట), మే 7 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండలం పోత్‌గల్ గ్రామ పంచాయతీ వద్ద బుధవారం ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు మొదట మంజూరైందని, ఇప్పుడు లిస్ట్‌లో తమ పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు మంజూరైన ఇళ్ల తిరిగి తమకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

చర్చి నిర్మాణంపై ఇరు వర్గాల మధ్య వివాదం

ఎల్లారెడ్డిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో చర్చి నిర్మాణంపై ఇరు వర్గాల నడుమ బుధవారం వివాదం నెలకొంది. అనుమతులు లేకుండా నిర్మాణ పనులను చేస్తున్నారని పేర్కొంటూ స్థానికులు, బీజేపీ నాయకులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాలను శాంతింపజేయడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. ఆగ్రహించిన స్థానికులు, బీజేపీ నాయకులు పనులు జరుగుతున్న చర్చి వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మరో వర్గం అక్కడకు వచ్చి ఇదేమిటనీ ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. పనులను నిలిపి వేయాలని కోరుతూ పంచాయతీకార్యదర్శికి స్థానికులు, బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు జరుగకుండా చూస్తానని పంచాయతీకార్యదర్శి హామీ ఇవ్వడంతో శాంతించారు. ఓవర్గం వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని చర్చి నిర్మాణంపై ఉన్న అనుమతులను సీఐ శ్రీనివాస్‌గౌడ్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు కూలి నిర్ణయించాలి

- సిరిసిల్లలో పాలిస్టర్ అసోసియేషన్ భవనం ఎదుట కార్మికుల ధర్నా



సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : స్వశక్తి సంఘాల మహిళలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తయారు చేయిస్తున్న చీరలకు కూలి నిర్ణయించడంతోపాటు వార్పిన్ కార్మికుల పట్ల పాలిస్టర్ యాజమానులు వైఖరిని మార్చుకోవాలంటూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, మూషం రమేష్‌లు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని కొత్తబస్టాండ్‌లోని పాలిస్టర్ అసోసియేషన్ సంఘ భవనం ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వార్పిన్ కార్మికులతో ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యాజమానులు వార్పిన్ కార్మికులను విస్మరిస్తున్నారన్నారు. వార్పిన్ కార్మికులకు గత బతుకమ్మ చీరల పనికంటే రెండింతలు పని భారం పెరిగిందని, పనికి తగ్గ వేతనం ఇవ్వడానికి యాజమాను లు ముందుకు రావడంలేదన్నారు. యాజమానుల వైఖరిని నిర సిస్తూ మంగళవారం నుంచి వార్పిన్ కార్మికులు సమ్మె బాట పట్టారన్నారు. కార్మికుల కూలి నిర్ణయం చేయవలసిన అధికారులు యాజమానులకు అప్పజెప్పడం వలన ఈ సమస్య తలెత్తిందన్నారు. జౌళి శాఖ అధికారులు కార్మికుల విషయాన్ని అసలు పట్టించుకోవడం లేదన్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు న్యాయమైన కూలీ నిర్ణయించి ఈ సమస్యలను పరిష్కారించాలని లేకుంటే గురువారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, వైపని యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి, ఒగ్గు గణేష్, ఏలిగేటి శ్రీనివాస్, ఐరన్ ప్రవీణ్, బూట్ల వెంకటేశ్వర్లు, దోమల రమేష్, చింతకింది సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పని చేసే కార్యకర్తలకే పదవులు..

- పీసీసీ పరిశీలకుడు, జిల్లా అబ్జర్వర్ చైతన్య కృష్ణారెడ్డి

వీర్నపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): పార్టీ పటిష్టత కోసం పని చేసే కార్యకర్తలకే పదవులు వస్తాయని పీసీసీ పరిశీలకులు, జిల్లా అబ్జర్వర్ చైతన్య కృష్ణారెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో గ్రామస్థాయి, మండల స్థాయి అధ్యక్ష ఎన్నికల కోసం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆధ్వర్యంలో నామినేషన్ల కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల సబ్బండ వర్గాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. అధిష్టానం నిర్ణయం ప్రకారం గ్రామస్థాయి, మండల స్థాయి కార్యవర్గాన్ని నియమించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిటి యాదవ్, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరిలాల్ నాయక్, సీనియర్ నాయకులు జోగుల కాంతయ్య, రాజు నాయక్, రాకేష్‌గౌడ్, ప్రకాష్ నాయక్, ఏఎంసీ డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నామినేషన్లు స్వీకరిస్తున్న జిల్లా అబ్జర్వర్ చైతన్యకృష్ణారెడ్డి

అధికారులే వచ్చి సమస్యలు పరిష్కరిస్తారు

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల వద్దకు అధికారులూ వచ్చి సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఆన్ వీల్స్‌ను ప్రారంభించినట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట, వెల్జీపూర్, ఒగులాపూర్ గ్రామాలలో బుధవారం ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ప్రజల ద్వారా వచ్చిన విన్నపాలను పరిశీలించి, అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. రహీంఖాన్‌పేట గ్రామానికి ఫీడర్ చానల్ నిర్మాణం, సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు నిధులు మంజూరుచేయాలని గ్రామస్థులు కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ముంగిట్లోకి తేవడం జరుగుతుందన్నారు. పనుల కోసం కార్యాలయాల చుట్టు తిరగవద్దని వారంలో మూడు రోజుల పాటు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమ సమస్యలు అప్‌లోడ్ చేసినట్లయితే వాటిని పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేస్తుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, వైద్యాధికారిణి జీవనజ్యోతి, సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఎం వాణిశ్రీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, పసుల వెంకటి, ముక్కీస కేశవరెడ్డి, గుండ వెంకటేశం, రాంప్రసాద్‌రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, స్వామిరెడ్డి, వీరేశం, బాలయ్య, ప్రసాద్, సురేందర్‌రెడ్డి, శంకర్, నితీష్, ప్రవీణ్, శ్రీనివాస్, మంద బాల్‌రెడ్డి, పర్శరాం, అనీల్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మండలంలోని వెల్జీపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర భవనానికి భూమిపూజ, చౌడాలమ్మ ఆలయంలో బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఒబులాపూర్ గ్రామంలో రెడ్డి సంఘ ప్రహరీగోడ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

‘ఆపరేషన్ సింధూర్’తో దేశసత్తా చాటిన సైనిక దళాలు

- బీజేపీ నాయకుల సంబరాలు



సిరిసిల్లలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు



కోనరావుపేటలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : భారత దేశం సత్తాను ఆపరేషన్ సింధూర్‌తో ఇండియన్ ఆర్మీ, సైనిక దళాలు చూపించాయని కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్ అన్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాదుల శిబిరాలను భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరుతో వైమానికి దాడులు చేసి ఉగ్రవాదులను ముట్టబెట్టడంతో బుధవారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారతీయజనతా పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆడెపు రవీందర్ మాట్లాడుతూ కాశ్మీర్‌లోని పర్యటక ప్రాంతమైన పహల్గాంలో హిందువులపై పాక్ ఉగ్రవాదులు కాల్చిచంపడాన్ని ఇండియన్ ఆర్మీ జీర్ణించుకోలేక ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు జరిపి దాయాది దేశానికి వార్నింగ్ ఇవ్వడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్ గుడూరి బాస్కర్, మాహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు వేముల వైశాలి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నే హరీష, ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, ఊరగొండ రాజు, చొప్పదండి అంజన్న, మోర శ్రీహరి, ల్యాగల భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : భారత సైన్యం సురక్షితంగా ఉండాలని కోరుకుంటూ బీజేపీ నాయకులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంగమరెడ్డిపల్లె గ్రామంలోని రామలింగేశ్వరస్వామి, ఇల్లంతకుంటలోని వీరబ్రహ్మేంద్రస్వామి, వల్లంపట్ల గ్రామంలోని హనుమాన్ ఆలయాలలో బుధవారం ప్రత్యేక అర్చనలు చేశారు.

ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు నాగసముద్రాల సంతోష్, కొలనూరు ముత్తవ్వ, కమలాకర్ రావు, గోపాల్, మాధురి, సతీష్‌కుమార్, వనజ, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : ఆపరేషన్ సింధూర్ దాడి విజయవంతం కావడంతో భారతీయ జనతా పార్టీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ మాట్లాడుతూ పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదుల స్థావరాలను గుర్తించి భారత సైనికులు పేల్చివేయడం సంతోష వ్యక్తం చేస్తున్నామని అన్నారు. భారతదేశం సంతోషం వ్యక్తం చేసే దినమని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పల్లం అన్నపూర్ణ, సురేందర్ రావు, వెలిశాల రవీందర్, గొట్టే రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సేవ చేయడమే సహకార సంఘాల లక్ష్యం

- సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి

వేములవాడ టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవ చేయడమే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రథమ లక్ష్యమని వేములవాడ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి అన్నారు. సంఘ కార్యలయంలో బుధవారం పాలకవర్గ సభ్యులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ంతులకు కొనుగోళ్ల కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల ద్వారా గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని, వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లి, బొల్లారం, చెక్కపల్లి, హన్మాజీపేట, లింగంపల్లి, మల్లారం, నమిలిగుండుపల్లి అర్బన్ మండలంలో మారుపాక, బాల్‌నగర్, శాత్రాజుపల్లి వార్డుల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని అన్నారు. ఇప్పటి వరకు 63 వేల 466 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతుల కోసం సహకార సంఘాలు నిరంతరం పని చేస్తున్నాయని తెలిపారు. సోషల్ మీడియా వేదికగా ఓ రెతు వరి ధాన్యం సెంటర్ వద్ద వీడియో తీసి సొసైటీనీ, సిబ్బందిని అగౌరవ పరిచే విధంగా మాట్లాడటం బాధను కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల నుంచి ధాన్యం కొనుగోలుకేంద్రాల్లో ఉన్నాయని వీడియో సదరు వ్యక్తి ప్రస్తావించాడని, ధాన్యం కొనుగోళు కేంద్రం ప్రారంభించి నెలరోజులు కాలేదని గుర్తుచేశారు. సొసైటీని, సిబ్బందిని ఇబ్బందిపెట్టే విషయాలు చేయకూడదని విజ్ఞప్తి చేశారు. రైతులకు ఎవరికి ఇబ్బందులు తలేత్తిన నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలన పాలకవర్గం ఖండిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీఈవో మిట్ట లక్ష్మణ్, వైస్‌చైర్మన్ లక్ష్మీకాంతరావు, డైరెక్టర్లు తోట రాజు, జేసింత, వెంకటేశం, అమృత, మల్లేశం, సంజీవరెడ్డి, లచ్చిరెడ్డి, సురేందర్‌రెడ్డి, భూలవ్వ, రాజయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రజిత

గంభీరావుపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఎస్ రజిత బుధవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో హాజరు రికార్డులను, మందుల రికార్డులను పరిశీలించి, వైద్య సిబ్బందితో సమీక్షించారు. గర్భిణుల నమోదు రికార్డులు, వ్యాధి నిరోధక కార్యక్రమ రికార్డులు, గర్భిణుల పరీక్షల కార్డులను పరిశీలించి, సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రోత్సహించాలని, ఆశా కార్యకర్తలకు, సిబ్బందికి సూచించారు. అనంతరం ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించి, సాధారణ ప్రసవాలు, ఎన్సీడి డయాబెటిక్, క్యాన్సర్, చిన్నపిల్లలకు సంబంధించి టీకాలపై అవగాహన కల్పించారు. వెంట వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, సిహెచ్‌వో రమేష్ సిబ్బంది ఉన్నారు.

ముస్తాబాద్ మండలంలో..

ముస్తాబాద్: మండలంలోని పోత్‌గల్ పరిధిలోని ఆవునూరు, గూడెం ఆరోగ్య ఉప కేంద్రాలను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్య సేవలు తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని అన్నారు. పీవోఎంహెచ్ఎన్ డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్, డీఐవో డాక్టర్ సంపత్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

చందుర్తి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీసాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో, జోగాపూర్ గ్రామంలో శ్రీబీరప్ప, కామరతి కల్యాణ మహోత్సవంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపల్లి రామస్వామి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ మాత జయంతి వేడుకలు

సిరిసిల్ల రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో బుధవారం వాసవి మాత జయంతి వేడుకలను చేపట్టారు. ఆర్యవైశ్య భవనంలోని కన్యకా పరమేశ్వరీ అలయంలో 108 కలశాలతో మహిళలు అభిషేకాలు, పుష్పార్చనలు, కుంకుమార్చనలను చేపట్టారు. సాయంత్రం పట్టణంలో రథయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘాలకు చెందిన మహిళలు, పాలకవర్గాలు పాల్గొన్నాయి.

● ఎల్లారెడ్డిపేట : వాసవి మాత జయంతిని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లిలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవి మాత ఆలయాల్లో అభిషేకం, కుంకుమ పూజలను నిర్వహించారు. చిన్న మల్లేశం, రాజేశం, నాగేందర్, రాజయ్య, అంజయ్య, మురళి, రాము, ఆంజనేయులు, శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్, రమణయ్య, బాలకిషన్, సతీష్, నాగరాజు పాల్గొన్నారు.

సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

గంభీరావుపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకంలో సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలని జైతెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం డిమాండ్ చేశారు. గంభీరావుపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన పెట్టడంతో అర్హులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఇల్లంతకుంట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో ఘనంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు జరిగాయి. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మంగారు సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎర్రోజు వెంకటేశ్వర్లు తిప్పారపు సంతోష్‌లతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ వీరబ్రహ్మేంద్రస్వామి- గోవిందమాంబ కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. మహిళలు ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు కిషన్, వసంత్, సురేందర్, కృష్ణమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో అన్నదాతల అవస్థలు



ఎల్లారెడ్డిపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆగయ్య తదితరులు

ఎల్లారెడ్డిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పట్టింపులేనితనంవల్ల అన్నదాతలు అవస్థలు పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అకాల వర్షానికి ఏమైనా ధాన్యం తడిసిపోయిందా..? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారుతోందని అన్నారు. తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆగయ్య డిమాండ్ చేశారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్‌డైరెక్టర్ కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.